# పోలింగ్‌కు సర్వం సిద్ధం

## అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన జిల్లా ఎన్నికల యంత్రాంగం

- పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్న 9,60,376 మంది ఓటర్లు
- ప్రత్యేక సిబ్బందితో పోలింగ్ నిర్వహణ
- 4 నియోజకవర్గాల్లో పోటీ పడుతున్న 61 మంది అభ్యర్థులు
- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,133 పోలింగ్ కేంద్రాలు
- 299 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు
- 810 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక కేంద్రాలు
- 2,500 మంది పోలీసులతో బందోబస్తు




పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, నవంబర్ 29, (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు జిల్లా ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగనున్నది. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ సరిపోను ఈవీఎంలను సిద్ధం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడంతో పాటు గుర్తించిన కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌తోపాటు సీసీ టీవీ కెమెరాలు, ట్యాబ్‌ల ద్వారా పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారులు పర్యవేక్షించనున్నారు. మరోవైపు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు అధికంగా ఉన్న కొడంగల్ నియోజకవర్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అదనంగా కేంద్ర బలగాలతోపాటు ఇతర పోలీస్ సిబ్బందితో భారీ భద్రతను సిద్ధం చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు వారి కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల నుంచి 200 మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనున్నది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోని అసెంబ్లీ ఎన్నికల బరిలో 61 మంది అభ్యర్థులు ఉన్నారు. వికారాబాద్ నియోజకవర్గ బరిలో 13 మంది, పరిగిలో 15 మంది, తాండూరులో 21 మంది, కొడంగల్ నియోజకవర్గంలో 13 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇప్పటివరకు 5,500 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**మొత్తం 9,60,376 మంది ఓటర్లు...**

జిల్లాలో మొత్తం 9,60,376 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 4,77,528 మంది, మహిళలు 4,82,808 మంది, ఇతరులు 40 మంది ఓటర్లు ఉన్నారు. వీటిలో పరిగి నియోజకవర్గంలో 2,59,422 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,31,163, మహిళలు 1,28,250 మంది, ఇతరులు 9 మంది ఓటర్లు ఉన్నారు. వికారాబాద్‌లో మొత్తం ఓటర్లు 2,28,253 మంది ఉండగా పురుషులు 1,13,919 మంది, మహిళలు 1,14,321 మంది, ఇతరులు 13 మంది ఓటర్లు ఉన్నారు. తాండూరు నియోజకవర్గంలో 2,36,076 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,15,143 మంది, మహిళలు 1,20,927 మంది, ఇతరులు ఆరు గురు ఓటర్లు ఉన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,36,625 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,17,303 మంది, మహిళలు 1,19,310 మంది, ఇతరులు 12 మంది ఓటర్లు ఉన్నారు. ఈదఫా ఎన్నికల్లో 45 వేల మంది కొత్త ఓటర్లు తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లు తప్పనిసరిగా ఎన్నికల అధికారులు జారీ చేసిన ఫొటో ఓటరు స్లిప్పులతోపాటు ఓటరు గుర్తింపు కార్డు లేదా ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ కంపెనీల ఉద్యోగుల గుర్తింపు కార్డు, బ్యాంకు, పోస్టాఫీస్ గుర్తింపు కార్డు, పాన్ కార్డ్, జాతీయ ఉపాధి హామీ పథకం గుర్తింపు కార్డు, కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా కార్డు, ఫొటో పింఛన్ డాక్యుమెంట్ తదితర గుర్తింపు కార్డులను ఓటర్లు తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాలని అధికారులు సూచించారు.



పోలింగ్ కేంద్రాలకు బస్సులో వెళ్తున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

**అందుబాటులో ఈవీఎంలు..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సరిపోను ఈవీఎంలను అందుబాటులో ఉంచారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ 135 శాతం మేర ఈవీఎంలను అందుబాటులో ఉంచారు. ఏదేని పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలో సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే 15 నిమిషాల్లో మరొక ఈవీఎంను ఏర్పాటు చేసేలా అవసరమైన చర్యలు జిల్లా ఎన్నికల అధికారులు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 914 బ్యాలెట్ యూనిట్స్, 428 కంట్రోల్ యూ నిట్స్, 227 వీవీప్యాట్‌లను సిద్ధంగా ఉంచారు. బుధవారం సాయంత్రం వరకు ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంలను తరలించిన అధికారులు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేశారు.

**ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది**

నాలుగు నియోజకవర్గాల్లో 5వేలకు పైగా మంది సిబ్బందితో ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు ఇతర ప్రిసైడింగ్ అధికారులతోపాటు అదనంగా కూడా పీవో, ఏపీవో, ఓపీవోలను జిల్లా ఎన్నికల యంత్రాంగం నియమించింది. ఇలా 1133 పోలింగ్ కేంద్రాల్లో 1302 మంది పీవోలు, 1302 మంది ఏపీవోలు, 2604 మంది ఓపీవోలు ఎన్నికల విధుల్లో ఉన్నారు. వీరితోపాటు నాలుగు నియోజకవర్గాలకు కలిపి 241 మంది మైక్రో అబ్జర్వర్లను కూడా నియమించారు. మరోవైపు జిల్లావ్యాప్తంగా 1133 పోలింగ్ కేంద్రాలుండగా, పరిగి నియోజకవర్గంలో 305, వికారాబాద్‌లో 284, తాండూరులో 269, కొడంగల్‌లో 275 పోలింగ్ కేంద్రాలున్నాయి.

**2500 మంది సిబ్బందితో భారీ భద్రత**

ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లావ్యాప్తంగా భారీ పోలీస్ బందోబస్తును సిద్ధం చేశారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల్లో జిల్లా పోలీస్ సిబ్బందితోపాటు కేంద్ర పారా మిలిటరీ బలగాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన హోంగార్డులతోపాటు జిల్లావ్యాప్తంగా 2500 మంది పోలీస్ ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది వరకు ఎన్నికల విధులను నిర్వహించనున్నారు. జిల్లా ఎన్నికల విధుల్లో 6 కంపెనీల పారా మిలిటరీ భద్రత సిబ్బంది, కర్ణాటక రాష్ట్రం నుంచి 900 మంది హోంగార్డులు, జిల్లాకు సంబంధించిన 1000 పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించి ఎస్పీతో పాటు ఇద్దరు అదనపు ఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 45 మంది ఎస్ఐలతోపాటు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో భద్రతను కట్టుదిట్టం చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు అధికంగా ఉన్న దృష్ట్యా అదనపు పోలీస్ సిబ్బందితో భద్రతను కట్టుదిట్టం చేశారు.

### పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి**

పోలింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు వేసేందుకు వెళ్లేవారు ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం గుర్తించిన ఏదో ఒక గుర్తింపు కార్డును పోలింగ్ కేంద్రాలకు వెంట తీసుకెళ్లాలి. దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశాం. దివ్యాంగులు, వృద్ధులను పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు 601 లోకేషన్లలో ప్రత్యేకంగా వాహనాలను కూడా సిద్ధం చేశాం.

### సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

జిల్లావ్యాప్తంగా 299 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో పరిగి నియోజకవర్గంలో 72, కొడంగల్‌లో 110, వికారాబాద్‌లో 65, తాండూరులో 52 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆయా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలతో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 810 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వీటిలో 600 పోలింగ్ కేంద్రాల లోపల, మరో 210 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి వెలుపల వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని ఎన్నికల అధికారులు పర్యవేక్షించనున్నారు.

### మహిళలు, దివ్యాంగుల కోసం..

మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఐదు పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేకంగా మహిళా ఓటర్లకు, ఐదు పోలింగ్ కేంద్రాలు దివ్యాంగులకు, మరో ఐదు పోలింగ్ కేంద్రాలు ప్రత్యేక యువతకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఏర్పాటు చేసింది. దివ్యాంగులు, వృద్ధులను ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తీసుకువెళ్లేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా 602 లోకేషన్లలో వృద్ధులు, వికలాంగ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు వాహనాలను సిద్ధం చేశారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి నాలుగు నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూంలకు తీసుకొచ్చి అక్కడి నుంచి పరిగి పట్టణంలోని ఏఎంసీ గోదాంలోని ఓట్ల లెక్కింపు కేంద్రానికి కేంద్ర బలగాల ఎస్కార్ట్స్ మధ్య ఈవీఎంలను తీసుకు రానున్నారు.



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు బస్సులో ఎక్కుతున్న సిబ్బంది



ఎన్నికల సామగ్రితో వెళ్తున్న పోలింగ్ సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన బస్సులు